## రెవెన్యూ అధికారుల లీలలెన్నో..?

ఇసుక అక్రమ వ్యవహారాల్లో పోలీసులకు దీటుగా రెవెన్యూ అధికారులు సైతం పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడుతున్నారు. ఆర్డీవోగా మంజీర పరివాహక ప్రాంతాల్లో ఇద్దరు ఐఏఎస్ అధికారులు పని చేస్తున్నారు. అయినప్పటికీ తహసీల్దార్ల అక్రమాలకు అడ్డుకట్ట పడకపోవడంపై ప్రజల్లో చర్చ నడుస్తున్నది. ఐఏఎస్ అధికారులపై రాజకీయ ఒత్తిళ్లు ఏమైనా ప్రభావం చూపుతున్నాయా? అనే వాదన కూడా వినిపిస్తున్నది. ఐఏఎస్ అధికారుల ఆదేశాలను ఆయా మండలాల్లో తహసీల్దార్లు పట్టించుకోవడం లేదనే వాదన కూడా ఉన్నది. అవకాశం దొరికినప్పుడల్లా అక్రమార్కులపై మంజీర పరివాహక ప్రాంతాల్లోని ఆర్డీవోలు ఉక్కుపాదం మోపుతున్నారు. కానీ స్థానిక రెవెన్యూ సిబ్బంది అంతగా సహకరించడం లేదని తెలుస్తున్నది. ఈ మధ్యనే మంజీర పరీవాహక ప్రాంతానికి బదిలీపై వచ్చిన ఓ వివాదాస్పద తహసీల్దార్ పాత్రపై ఏసీబీ దృష్టి పెట్టినట్లు తెలుస్తున్నది. సదరు తహసీల్దార్ ఓ పోలీస్ అధికారికి అత్యంత సన్నిహితుడు. అతడికి పోస్టింగ్ ఇప్పించడంలోనూ సదరు పోలీస్ అధికారి కీలకంగా వ్యవహరించినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. రెవెన్యూ శాఖలోనూ ఏసీబీ సోదాలు నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు. కొంతమంది పోలీసులు, తహసీల్దార్లకు సంబంధించిన సంపాదనలో ఆదాయానికి మించిన ఆస్తులు సైతం వెలుగు చూసే అవకాశం ఉన్నట్లు చెబుతున్నారు.

## ఏసీబీ దాడులతో అవినీతి బహిర్గతం..

బిచ్కుంద పోలీస్‌స్టేషన్‌లో అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ) ఆకస్మిక సోదాలతో ఇసుక అక్రమార్కులతో పోలీసులు చేతులు కలిపిన వైనం తేటతెల్లమైంది. బిచ్కుంద ఠాణాలో బహిరంగంగానే అక్రమార్కులతో అంటకాగుతూ డబ్బులు డిమాండ్ చేయడం ఏసీబీ అధికారుల సోదాల్లో వెల్లడైంది. దీంతో పాటు విధి నిర్వహణలో అలసత్వం వహిస్తున్న విషయాన్ని ఏసీబీ గుర్తించింది. ఇసుక ట్రాక్టర్ల కోసం రాత్రి, పగలు తేడా లేకుండా కాపుగాచి మామూళ్లు వసూలు చేస్తున్నట్లుగా ఏసీబీ గుర్తించింది. నెలవారీ మామూళ్లతోపాటు వారం, రోజువారీగా ట్రిప్పుకు ఒక రేటు చొప్పున వసూళ్లకు తెగబడుతున్నట్లు ఏసీబీ దృష్టికి వచ్చింది. పేరుకు బిచ్కుంద ఠాణాకు చెందిన పోలీసులే వసూళ్లలో ముందు కనిపిస్తున్నప్పటికీ తెర వెనుక ఇతర అధికారుల హస్తం కూడా ఉన్నట్లుగా తెలుస్తున్నది. అవినీతి, అక్రమాలు బహిరంగంగానే సాగుతుంటే పర్యవేక్షించాల్సిన అధికారులు ఏం చేస్తున్నారు? అనే ప్రశ్నను లోతుగా ఏసీబీ పరిశీలిస్తున్నది. వివాదాస్పద ఠాణాగా ముద్ర పడిన బిచ్కుంద పీఎస్‌పై ఆది నుంచి అందరి కన్ను ఉన్నది. అలాంటి ఠాణాపై నిరంతర నిఘా, పర్యవేక్షణ లేమి మూలంగా ఇక్కడ కొందరికి విచ్చలవిడితనం పెరిగిపోయింది. ఏసీబీ అధికారుల సుదీర్ఘ సోదాల్లో అనేక అక్రమాలు, అవినీతి వెలుగు చూసింది. ఉన్నతాధికారులకు పూర్తి నివేదికను ఏసీబీ సమర్పించనున్నది. తప్పు చేసిన పోలీసులపై త్వరలోనే సస్పెన్షన్ లేదా బదిలీ వేటు పడే అవకాశాలు ఉన్నట్లు సమాచారం.

## మంజీరలో ఇసుక క్వారీలు బంద్

- అధికార యంత్రాంగాన్ని కదిలించిన 'మంజీరకు గర్భ శోకం!' కథనం
- క్వారీలను బంద్ చేస్తూ ఆదేశాలు

బోధన్, మే 15: బోధన్ నియోజకవర్గంలోని బోధన్ మండలంలో మంజీర నది తీరాన ఉన్న సిద్ధాపూర్, ఖండ్‌గావ్ ఇసుక క్వారీలను గురువారం మూసివేశారు. 'నమస్తే తెలంగాణ' దినపత్రిక మెయిన్ ఎడిషన్‌లో 'మంజీరకు గర్భ శోకం!' పేరిట బుధవారం ప్రత్యేక కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. సిద్ధాపూర్, ఖండ్‌గావ్ ఇసుక క్వారీల్లో నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న ఇసుక తవ్వకాలు, రవాణాపై ప్రచురితమైన ఈ కథనం స్థానికంగా సంచలనం రేపింది. ఈ కథనంతో అధికార యంత్రాంగంలో కదలిక వచ్చింది. ఈ రెండు ఇసుక క్వారీలను బంద్ చేస్తూ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీచేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సిద్ధాపూర్, ఖండ్‌గావ్ క్వారీలను బంద్ చేశామని, మళ్లీ క్వారీలను తెరిచేందుకు ఆదేశాలు వస్తే.. తెరువనున్నట్లు బోధన్ తహసీల్దార్ విఠల్ 'నమస్తే తెలంగాణ'కు వివరణ ఇచ్చారు.



బుట్ట దాఖలవుతున్న డీజీపీ ఆదేశాలు..

గతేడాది నిజామాబాద్ జిల్లాలో ఇసుక అక్రమ వ్యవహారాల్లో జోక్యం చేసుకుని అక్రమాలకు పాల్పడుతున్న పది మంది ఎస్సైలు, ఇద్దరు సీఐలపై చర్యలు తీసుకోవాలని స్వయంగా డీజీపీ జితేంద్ర ప్రసాద్ మెమో జారీచేశారు. నిఘా వర్గాల సమాచారం మేరకు వచ్చిన వివరాలను ఉటంకిస్తూ డీజీపీ ఆదేశాలు జారీ చేయడంతో పలువురిపై బదిలీ వేటు వేశారు. కామారెడ్డిలో ఈ తరహాలో ప్రక్షాళన జరగడం లేదన్న వాదన వినిపిస్తున్నది. సీఎం రేవంత్ రెడ్డి, డీజీపీ జితేంద్రప్రసాద్ ప్రత్యక్షంగా అనేక మార్లు సహజ వనరుల దోపిడీపై ఉక్కుపాదం మోపాలని చెప్పారు. ఎంతటి వారినైనా పట్టుకుని చట్ట ప్రకారం శిక్షించాలన్నారు. కానీ సీఎం, డీజీపీ ఆదేశాలు మాత్రం ఇక్కడ అమలు కావడం లేదు. కామారెడ్డి జిల్లాలో జనవరి 29న లంచం తీసుకుంటూ లింగంపేట ఎస్సై సుధాకర్ ఏసీబీకి పట్టుబడ్డాడు. అనంతరం నాలుగు నెలలకు ఏసీబీ అధికారులు నేరుగా బిచ్కుంద పోలీస్‌స్టేషన్‌లోనే సోదాలు నిర్వహించడం ప్రాధాన్యతను సంతరించుకున్నది.


# ఇసుక మేత..

నమస్తే తెలంగాణ ఎఫెక్ట్




నిజామాబాద్, మే 15 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): మంజీర పరీవాహక ప్రాంతాల్లోని పోలీస్ స్టేషన్లలో విధులు నిర్వహించేందుకు ఖాకీలు పోటీ పడుతుంటారు. ఇందుకోసం రాజకీయ పైరవీలు చేసుకొని మరీ పోస్టింగ్ సాధిస్తారు. అలాంటి వారు పోలీస్ ఉన్నతాధికారులను లెక్క చేయకుండా ఖద్దరు నేతల ఆశీస్సులుంటే చాలనుకుంటారు. ముడుపులు ఇచ్చి పోస్టింగ్ తెచ్చుకున్న ఖాకీలు బరితెగించి వసూళ్లకు పాల్పడుతున్నారు. కామారెడ్డి జిల్లా నిజాంసాగర్ నుంచి మొదలు నిజామాబాద్ జిల్లా రెంజల్ మండలం వరకూ మంజీర పరీవాహక ప్రాంతం ఉన్న ఆయా పోలీస్ స్టేషన్లకు భారీ డిమాండ్ ఏర్పడింది. మంజీరలో లక్షల క్యూబిక్ మీటర్లలో ఇసుక తవ్వకాలకు అవకాశం దక్కడమే ఇందుకు ప్రధాన కారణం. అందులోనూ ఇసుక క్వారీలు నిర్వహించే ప్రాంతాల్లో మరింత ప్రాధాన్యత ఉన్నది. కొంత మంది సీఐ, ఎస్సైలు బహిరంగంగానే వసూళ్ల పర్వం కొనసాగిస్తున్నప్పటికీ పోలీస్ బాస్‌లు కూడా పట్టించుకోవడం లేదు. తప్పు చేస్తే చిన్నపాటి కారణాలపై కానిస్టేబుళ్లను సస్పెండ్ చేసే ఉన్నతాధికారులకు ఇలాంటి అక్రమార్కులపై నిఘా ఎందుకు పెట్టడం లేదని సొంత శాఖలోని కొంతమంది సిబ్బంది ప్రశ్నిస్తున్నారు. మంజీర పరీవాహకంలో ఇసుక దందా నడుస్తుందన్న విషయం అందరికీ తెలిసిందే. అయినప్పటికీ చర్యలు తీసుకోవడంలో మీనమేషాలు లెక్కించడం విడ్డూరంగా మారింది.

- ఏసీబీ దాడులతో ఉన్నతాధికారుల వైఫల్యం బహిర్గతం
- మామూళ్ల మత్తులో జోగుతున్న పోలీసులు
- ఇసుక అక్రమ దందాను అరికట్టడంలో విఫలం
- మంజీర పరీవాహకంలో ఖాకీలకు ప్రజాప్రతినిధుల అండ



అక్రమార్కులతో పోలీసుల చెట్టాపట్టాల్



సెల్ టవర్ ఎక్కి నిరసన వ్యక్తం చేస్తున్న మల్లారం గ్రామ వాసి జల్లాపురం సాయిలు

## 'ఇందిరమ్మ' ఇండ్ల జాబితాలో పేరు కట్!

**సెల్ టవర్ ఎక్కి యువకుడి నిరసన**

- రూరల్ ఎమ్మెల్యే హామీతో టవర్ దిగిన బాధితుడు
- ప్రభుత్వ నిబంధనలతో పేదలకు నష్టం

సారంగాపూర్, మే 15: ఇందిరమ్మ ఇండ్ల జాబితాలో నుంచి అధికారులు తన పేరును తొలగించారని మనస్తాపం చెందిన యువకుడు సెల్ టవర్ ఎక్కి నిరసన వ్యక్తం చేసిన ఘటన రూరల్ మండలంలోని మల్లారం గ్రామంలో గురువారం చోటుచేసుకున్నది. గ్రామానికి చెందిన జల్లాపురం సాయిలుకు సొంతిల్లు లేకపోవడంతో భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి అదే గ్రామంలో ఓ అద్దె ఇంట్లో నివసిస్తున్నాడు. ప్రభుత్వం తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తుందనే నమ్మకంతో తనకున్న స్థలంలో బేస్‌మెంట్ వరకు ఇల్లు నిర్మించుకున్నాడు. ఇందిరమ్మ ఇండ్ల కోసం అధికారులు ఇటీవల ఇంటింటి సర్వే నిర్వహించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు సొంత స్థలంలో ఎలాంటి నిర్మాణం లేని వారికే ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలి. దీంతో అధికారులు అర్హుల జాబితా నుంచి అతడి పేరును తొలగించారు. ఈ విషయమై తీవ్ర మనస్తాపం చెందిన సాయిలు.. గురువారం ఉదయం సెల్ టవర్ ఎక్కి ఆత్మహత్యాయత్నం చేశాడు. స్థానికులు గమనించి రూరల్ పోలీసులకు సమాచారం అందించారు. అదే ప్రాంతం మీదుగా వెళ్తున్న కాంగ్రెస్ నాయకుడు పరిస్థితిని రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డికి ఫోన్ ద్వారా చేరవేశారు. ఎమ్మెల్యే స్పందించి.. కాన్ఫరెన్స్ ద్వారా బాధితుడితో మాట్లాడారు. ఇల్లు ఇప్పించే బాధ్యత తనదని.. టవర్ దిగాలని భరోసా కల్పించాడు. ఎమ్మెల్యే హామీతో సాయిలు టవర్ దిగాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు.. బాధితుడికి కౌన్సెలింగ్ ఇచ్చారు. సాయిలు సెల్ టవర్ ఎక్కిన విషయం దావనంలా వ్యాపించడంతో ప్రజలు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. కాగా.. ఇందిరమ్మ ఇండ్ల మంజూరులో ప్రభుత్వం పెట్టిన పలు నిబంధనలు పేదలకు శాపంగా మారాయని, వాటిని తొలగించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. తమ స్థోమత మేరకు బేస్‌మెంట్, రెంటల్ లెవర్ వరకు ఇల్లు నిర్మించుకున్న వారికి కూడా 'ఇందిరమ్మ' జాబితాలో అర్హత కల్పించాలని కోరుతున్నారు.

## భర్త మరణాన్ని తట్టుకోలేక.. భార్య ఆత్మహత్య

- కుమారుడితో కలిసి నిజాంసాగర్‌లో దూకి బలవన్మరణం
- మృతులు సంగారెడ్డి జిల్లా వాసులు

నిజాంసాగర్, మే 15: భర్త మరణాన్ని తట్టుకోలేక ఓ వివాహిత నిజాంసాగర్ ప్రాజెక్టులో దూకి ఆత్మహత్య చేసుకున్నది. ఈ ఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. నిజాంసాగర్ ఎస్సై శివకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా నిజాంపేట్ మండలం మునిగేపల్లి గ్రామానికి చెందిన దార సాయిలు అప్పుల బాధతో ఏప్రిల్ 24వ తేదీన ఆత్మహత్య చేసుకున్నాడు. అప్పటి నుంచి అతడి భార్య ప్రమీల (29) తీవ్ర మనోవేదనకు గురవుతున్నది. ఈ క్రమంలో నిజాంపేట్‌లోని బ్యాంకులో పని ఉన్నదని చెప్పి కొడుకు అక్షయ్ (7)ని తీసుకొని బుధవారం ఇంట్లో నుంచి బయల్దేరింది. నిజాంసాగర్ ప్రాజెక్టు వద్దకు వచ్చి ప్రాజెక్టు 20 గేట్ల వద్ద కొడుకుతో కలిసి నీటిలో దూకింది. నిజాంసాగర్‌లో చేపలు పట్టేవారు ఇద్దరి మృతదేహాలను గురువారం గుర్తించి, పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాలను వెలికి తీయించారు. మృతులు మునిగేపల్లికి చెందిన వారుగా గుర్తించి కుటుంబీకులకు సమాచారం అందించారు. ప్రమీల తండ్రి దుర్గయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం బాన్సువాడ ఏరియా దవాఖానకు తరలించినట్లు ఎస్సై శివకుమార్ తెలిపారు. మృతురాలికి కూతురు నిహారిక ఉన్నదన్నారు.



మృతదేహాలను పరిశీలిస్తున్న నిజాంసాగర్ ఎస్సై శివకుమార్

## చైన్ స్నాచింగ్ ముఠా అరెస్టు

- 12 తులాల బంగారం ఆభరణాలు, ఒక ట్రాక్టర్, రెండు బైకులు స్వాధీనం
- నిందితులు మహారాష్ట్ర నుంచి వచ్చిన వలస కూలీలు
- వివరాలు వెల్లడించిన సీపీ సాయి చైతన్య



వివరాలను వెల్లడిస్తున్న పోలీస్ కమిషనర్ సాయిచైతన్య

ఆర్మూర్‌టౌన్, మే 15: ఆటోలో వెళ్తున్న మహిళలను టార్గెట్ చేసి చైన్ స్నాచింగ్‌కు పాల్పడుతున్న ముఠాను పట్టుకున్నట్లు నిజామాబాద్ పోలీసు కమిషనర్ సాయి చైతన్య తెలిపారు. ఆర్మూర్ పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను ఆయన వెల్లడించారు. ఆర్మూర్ మండలంలోని ఫత్తేపూర్ గ్రామానికి చెందిన బొబ్బిలి లక్ష్మి చైన్ స్నాచింగ్‌పై ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. పట్టణంలోని పెర్కిట్ బైపాస్ వద్ద పోలీసులు గురువారం వాహనాల తనిఖీ చేపట్టారు. అటుగా వచ్చిన ఏడుగురిపై అనుమానంతో అదుపులోకి తీసుకొని విచారించారు. దీంతో తాము చైన్ స్నాచింగ్‌కు పాల్పడుతున్నట్లు వారు ఒప్పుకున్నారు. మహారాష్ట్రకు చెందిన వారు నిర్మల్ జిల్లా తిమ్మాపూర్, మంజులాపూర్ ప్రాంతాల్లో కూలీ పనులు చేసుకుంటూ.. మహిళల మెడలో నుంచి బంగారం గొలుసులు చోరీ చేస్తున్నట్లు తెలిపారు. నిందితుల నుంచి 12 తులాల బంగారు ఆభరణాలు, ఒక ట్రాక్టర్, రెండు బైకులు స్వాధీనం చేసుకున్నట్లు సీపీ తెలిపారు. నిందితులను పట్టుకోవడానికి కృషి చేసిన పోలీసులకు సీపీ అవార్డులు అందజేశారు. ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర్ రెడ్డి, ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ గౌడ్ పాల్గొన్నారు.

## కాళేశ్వరం కెనాల్ పనులకు నిధులు మంజూరు

**కామారెడ్డి కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్**



సమావేశంలో మాట్లాడుతున్న కామారెడ్డి కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

కామారెడ్డి,మే 15: కాళేశ్వరం ప్యాకేజీ 22 కెనాల్ పనులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.23.15 కోట్ల నిధులు మంజూరు చేసిందని కామారెడ్డి కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ తెలిపారు. కలెక్టరేట్‌లోని తన క్యాంప్ కార్యాలయంలో ఇరిగేషన్ సీఈవో శ్రీనివాస్, ఎల్లారెడ్డి ఈఈ మల్లేశ్‌తో కలిసి భూ సేకరణ పనులపై గురువారం చర్చించారు. కెనాల్ పనుల కోసం 316 ఎకరాలకు నిధులు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. మరో 97 ఎకరాలు అవార్డ్ స్టేజీలో ఉన్నాయని, రైతులకు డబ్బులు చెల్లించాలని కలెక్టర్‌ను అధికారులు కోరారు. 203 ఎకరాలు రికార్డు స్టేజీలోనే ఉన్నందున.. వాటిని అవార్డు స్టేజీకి తీసుకెళ్లాలని ఆర్డీవోకు సూచిస్తూ, భూ సేకరణ పనులు త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.


## ఇంకెన్నాళ్లు?

**మాక్లూర్ మండలం** మామిడిపల్లి వద్ద రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులు ఏండ్లుగా కొనసాగుతున్నాయి. దీంతో పక్కన ఉన్న ప్రధాన రహదారి మొత్తం పగిలిపోతున్నది. రాళ్లు తేలి ప్రయాణానికి తిప్పలు తప్పడం లేదు. ఈ దారి గుండా వెళ్లేదంపకు వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డు పూర్తిగా ధ్వంసం అవడంతో తాత్కాలికంగా ఊళ్లో నుంచి మరో దారి ఏర్పాటుచేశారు. ఆ రోడ్డు మీదుగా కూడా భారీ వాహనాలు వెళ్లడంతో దుమ్ము, ధూళి లేస్తున్నది. తాము రోగాల బారిన పడుతున్నామని స్థానిక ప్రజలు వాపోతున్నారు. రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులు త్వరగా పూర్తిచేయాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్







రోడ్డు పూర్తిగా ధ్వంసం కావడంతో ఏర్పడిన గుంతలు

ధ్వంసమైన రోడ్డుపై నుంచి ప్రయాణిస్తున్న వాహనాలు